## సూర్యాపేట ప్రధాన ప్రథమ శ్రేణి న్యాయమూర్తిగా రజిత

సూర్యాపేట లీగల్, అక్టోబర్ 26 : సూర్యాపేట ప్రధాన ప్రథమ శ్రేణి న్యాయమూర్తిగా రజిత గోపు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడి విధుల్లో ఉన్న కె.సురేశ్ కోదాడ సీనియర్ సివిల్ జడ్జిగా పదోన్నతిపై వెళ్లారు. కరీంనగర్ జిల్లాకు చెందిన రజిత గోపు 2021లో మొదటిసారి న్యాయమూర్తిగా హైదరాబాద్‌లో విధుల్లో చేరి బదిలీపై సూర్యాపేటకు వచ్చారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రధాన ప్రథమ శ్రేణి న్యాయమూర్తి రజిత గోపు


# నమస్తే తెలంగాణ
# యాదాద్రి భువనగిరి

I హైదరాబాద్, ఆదివారం 27 అక్టోబర్ 2024 YADADRI BHUVANAGIRI


## 7 నెలల పసికందుకు సీపీఆర్

### ప్రాణం నిలిపిన 108 అంబులెన్స్ సిబ్బంది

### చిల్పకుంట్ల నుంచి సూర్యాపేట వరకు ఆపని ప్రయత్నం

సూర్యాపేట టౌన్, అక్టోబర్ 26 : నెలలు నిండక ముందే పుట్టి ఉలుకూ పలుకు లేకుండా ఉన్న పసికందుకు 108 అంబులెన్స్ సిబ్బంది సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడారు. నూతనకల్ మండలం చిల్పకుంట్ల గ్రామానికి చెందిన పంతం సుభద్ర ఏడు నెలల గర్భిణి. కొద్ది నెలల క్రితమే ఆమె భర్త చనిపోగా, నా అనేవారు ఎవరూ లేరు. శనివారం మధ్యాహ్నం పురిటి నొప్పులు రావడంతో ఇంట్లోనే ప్రసవించింది. 800 గ్రాముల బరువుతో పుట్టిన మగ శిశువు స్పందనలు లేకుండా ఉండడంతో ఆశ వర్కర్ భారమ్మ నవజాత శిశువులకు సంబంధించి ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన 108 అంబులెన్స్‌కు ఫోన్ చేసింది. హుటాహుటిన వచ్చిన అంబులెన్స్ సిబ్బంది చిల్పకుంట్ల నుంచి సూర్యాపేట జనరల్ దవాఖానకు వచ్చే వరకు శిశువుకు సుమారు 50 నిమిషాల పాటు సీపీఆర్ చేసి కృత్రిమ శ్వాసను అందించారు. దాంతో దవాఖానకు చేరుకునేలోపు శిశువు శ్వాస తీసుకోవడం ప్రారంభించాడు. అనంతరం నవజాత శిశువుల వార్డులో చేర్పించగా, డాక్టర్లు వైద్యం ప్రారంభించారు. సమయ స్ఫూర్తితో శిశువు ప్రాణం నిలిపిన 108 టెక్నీషియన్ ప్రదీప్‌కుమార్, డ్రైవర్ నాగేశ్వర్ రావును చిన్న పిల్లల డాక్టర్ ప్రొఫెసర్ శాలిని ప్రియ అభినందించి, ప్రశంసాపత్రం అందజేశారు.



చిన్నారికి సీపీఆర్ చేస్తున్న నవజాత శిశువుల అంబులెన్స్ సిబ్బంది

# పిల్లల బువ్వపై బిల్లుల దెబ్బ

## సంక్షేమ హాస్టళ్ల బిల్లులు పెండింగ్



ఎస్సీ హాస్టల్ భువనగిరి

- ఆరు నెలలుగా చెల్లించని రాష్ట్ర ప్రభుత్వం
- ఒక్కో సంక్షేమ శాఖలో రూ.50లక్షల వరకూ పెండింగ్
- భారంగా మారిన వసతి గృహాల నిర్వహణ
- ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న వార్డెన్లు
- మెనూ ప్రకారం విద్యార్థులకు అందని భోజనం
- ఆరోగ్యం, శారీరక ఎదుగుదలపై ప్రభావం
- ఈ ఏడాది పత్తాలేని డ్రెస్‌లు, బ్యాగులు

**రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్లను పట్టించుకోవడం లేదు. నెలనెలా రావాల్సిన డైట్ బిల్లులను చెల్లించడం లేదు. జిల్లాలో ఆరు నెలలుగా బిల్లులు పెండింగ్‌లో మూలుగుతున్నాయి. ఒక్కో శాఖలో రూ.50లక్షల నిధులు పేరుకుపోయాయి. ఫలితంగా వసతి గృహాల నిర్వహణ భారంగా మారింది. వార్డెన్లు అప్పులు చేసి వసతి గృహాలను నిర్వహిస్తున్నారు. దాంతో విద్యార్థులకు సక్రమంగా మెనూ, నాణ్యమైన భోజనం అందడం లేదు. మరోవైపు ఎస్సీ హాస్టళ్లలో ఇప్పటివరకు విద్యార్థులకు డ్రెస్‌లు పంపిణీ చేయకపోవడం విచారకరం.**

– యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 26 (నమస్తే తెలంగాణ)

### అప్పులు చేసి హాస్టళ్ల నిర్వహణ

ప్రభుత్వం సకాలంలో నిధులు చెల్లించకపోవడంతో బిల్లుల చెల్లింపుల్లో వార్డెన్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూరగాయలు, చికెన్, గ్యాస్, గుడ్లు, అరటి పండ్లు, పాలు తదితర వస్తువుల కొనుగోలుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వసతి గృహాల నిర్వహణ కోసం కొందరు వార్డెన్లు జీతం నుంచి సొంతంగా ఖర్చు చేస్తున్నారు. మరికొందరు ఉద్దెరకు తెస్తూ వండి పెడుతుండగా, ఇంకొందరు అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొంది. దాంతో లక్షల రూపాయల్లో బిల్లులు పేరుకుపోతున్నాయి. కిరాణ దుకాణ యజమానులు కూడా తమకు ఉద్దెర ఇవ్వడం లేదని వార్డెన్లు వాపోతున్నారు.

### పెండింగ్ బిల్లులు ఇలా..

జిల్లాలో ప్రీమెట్రిక్ ఎస్సీ హాస్టళ్లు 19 నడుస్తున్నాయి. అందులో బాలురవి 11, బాలిక వసతి గృహాలు 8 ఉన్నాయి. వాటిల్లో సుమారు 1,500 మంది విద్యార్థులు ఉంటున్నారు. ఈ ఏడాది జూన్ వరకు బిల్లులు మంజూరు కాగా.. అప్పటి నుంచి నిధులు బంద్ అయ్యాయి. ఒక్క నెలకు 15 లక్షల రూపాయల వరకు బిల్లులు చెల్లించాల్సి ఉంటుంది. ఎస్సీ సంక్షేమ అభివృద్ధి శాఖ పరిధిలో 50 లక్షలకు పైగా పెండింగ్‌లో ఉన్నాయి. బీసీ హాస్టళ్లలోనూ ఇదే పరిస్థితి ఉంది. జిల్లాలో 15 హాస్టళ్లు ఉండగా, సుమారు 500 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వారికి ఫిబ్రవరి వరకు మాత్రమే బిల్లులు వచ్చాయి. సుమారు 8 నెలలుగా నిధులు లేవు. గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో 8 ఎస్టీ హాస్టళ్లు ఉండగా, సుమారు 700 మంది విద్యార్థులు ఉన్నారు. గిరిజన సంక్షేమ వసతి గృహాల్లోనూ మార్చి నుంచి బిల్లులు రావడం లేదు. దాదాపు 40 లక్షల వరకు బిల్లులు రావాల్సి ఉంది.

### మెనూ అమలు అంతంతే..

ప్రభుత్వం 3వ తరగతి నుంచి 7వ తరగతి వరకు విద్యార్థులకు నెలకు రూ.950, 8వ తరగతి నుంచి 10వ తరగతి స్టూడెంట్లకు రూ.1,100 చెల్లిస్తున్నది. బిల్లులు పెండింగ్‌లో ఉండడం వల్ల విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందడం లేదు. బిల్లులు రాలేదని వార్డెన్లు ఉన్నదాంట్లోనే సరిపెడుతున్నారని విద్యార్థులు వాపోతున్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు రోజూ ఉదయం రాత్రి భోజనంతోపాటు వారానికి ఒకసారి చికెన్, మూడు రోజులు కోడిగుడ్లు, అరటి పండ్లు ఇవ్వాలి. కానీ నిత్యావసర ధరలు పెరగడంతో పాటు బిల్లులు రాక మెనూ సక్రమంగా అమలు చేయడం లేదు. వారానికి రెండు గుడ్లు మాత్రమే ఇస్తున్నారు. ఇడ్లీకి బదులు ఉప్మాతో సరిపెడుతున్నారు. ఇలా నాణ్యమైన భోజనం దొరక్కపోతే విద్యార్థుల ఆరోగ్యం, ఎదుగుదలపై ప్రభావం పడే ప్రమాదం ఉంది.

### డ్రెస్‌లు, బ్యాగ్‌లు ఇంకెప్పుడిస్తరు?

హాస్టల్ విద్యార్థులకు ఏటా నాలుగు జతల యూనిఫామ్, కార్పెట్లు, బెడ్ షీట్లు, ఉలెన్ బ్లాంకెట్లు, స్కూల్ బ్యాగ్, మ్యాట్రెస్, దిండ్లు, నోట్‌బుక్స్ ఇస్తారు. వాస్తవానికి ఇవి హాస్టల్ ప్రారంభంలోనే ఇస్తారు. కానీ ఇప్పటి వరకు జిల్లాలోని ఎస్సీ హాస్టళ్లలో డ్రెస్సులు, బ్యాగులు ఇవ్వలేదు. కార్పెట్లు, బెడ్ షీట్లు మాత్రం ఇచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే మెస్ బిల్లులతోపాటు డ్రెస్‌లు అందించాలని చేయాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నారు.

### డైట్ బిల్లులు వెంటనే చెల్లించాలి..



రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల డైట్ బిల్లులు పెండింగ్ పెట్టడం సబబు కాదు. నెలల తరబడి నిధులు ఇవ్వకుంటే హాస్టళ్ల నిర్వహణ ఎలా సాధ్యమవుతుంది? ఎప్పటికప్పుడు బిల్లులు రాకపోవడంతో వల్ల వార్డెన్లు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందడం లేదు. ప్రభుత్వం వెంటనే హాస్టల్ డైట్ బిల్లులను చెల్లించాలి. డ్రెస్‌లు, బ్యాగులు అందించాలి.

**- శాంతి కుమార్, ఏఐఎస్ఎఫ్, జిల్లా అధ్యక్షుడు**



అడ్డగూడూరు గురుకుల పాఠశాలలో విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కే జెండగే

## నాణ్యమైన విద్య అందించాలి

### కలెక్టర్ హనుమంతు కే జెండగే

అడ్డగూడూరు, అక్టోబర్ 26 : విద్యార్థినులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు పని చేయాలని కలెక్టర్ హనుమంతు కే జెండగే అన్నారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల, విద్యార్థినుల హాజరు పట్టిక, వంట గది, భోజనం పరిశీలించారు. మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా, లేదా అన్నది విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులు వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ప్రోత్సహించాలి. పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట తాసీల్దార్ శేషగిరిరావు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ విజిన ఉన్నారు.




వైకుంఠ ద్వారం వద్ద బీఆర్ఎస్ మల్లాపురం యువజన నాయకులు

## మల్లాపురంలో మెడికల్ కాలేజీకి శంకుస్థాపన చేయాలి

- యాదగిరిగుట్టకు బీఆర్ఎస్ యువత పాదయాత్ర
- ప్రభుత్వానికి చిత్తశుద్ధిని ప్రసాదించాలని స్వామివారికి వేడుకోలు

యాదగిరిగుట్ట, అక్టోబర్ 26 : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.183 కోట్లతో మల్లాపురం గ్రామానికి మంజూరైన ప్రభుత్వ వైద్య కళాశాల, 250 పడకల ఆసుపత్రి నిర్మాణానికి వెంటనే శంకుస్థాపన చేయాలని బీఆర్ఎస్ యువజన విభాగం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ సర్కారుకు చిత్తశుద్ధిని ప్రసాదించాలని లక్ష్మీనరసింహ స్వామిని కోరుతూ శనివారం మల్లాపురం నుంచి యాదగిరిగుట్టకు పాదయాత్ర చేశారు. స్వామివారి వైకుంఠ ద్వారం వద్దకు చేరుకుని కొబ్బరికాయ సమర్పించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యకు కనువిప్పు కలిగి వైద్య కళాశాల వెంటనే శంకుస్థాపన చేసే విధంగా బుద్ధిని ప్రసాదించాలని స్వామివారిని వేడుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కేసీఆర్ సర్కారు యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి పేరిట వైద్య కళాశాలను మంజూరు చేసి పరిపాలన అనుమతులను సైతం ఇస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదన్నారు. వైద్య కళాశాలను తరలించాలని చూస్తే ఊరుకోమని, త్వరలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు. ర్యాలీకి బీఆర్ఎస్ పట్టణ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి స్వాగతం పలికారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యువజన విభాగం నాయకులు ఒగ్గు మల్లేశ్, శేఖర్, జరిగే విజయ్, రమేశ్, శ్రీశైలం, శీను, లింగం, శ్రీదర్, వంశీ రాజు, పిట్టల రాములు, మల్లేశ్, జహంగీర్, ఇండ్ల ప్రసాద్, దినేశ్‌రెడ్డి, ఎండీ ఇమామ్ పాల్గొన్నారు.

## దొంగబాబాను పట్టించిన ఫోన్ పే

ఆత్మకూరు(ఎం), అక్టోబర్ 26 : బాబా ముసుగులో మోసాలకు పాల్పడి ఉడాయిస్తున్న కేటుగాడిని ఫోన్‌పే పోలీసులకు పట్టించింది. ఆత్మకూర్(ఎం) మండలంసింగారం గ్రామ పంచాయతీ పరిధిలోని శేర్ బావి గ్రామానికి శుక్రవారం దొంగబాబా వేషధారణలో వచ్చిన ఓ వ్యక్తి వచ్చాడు. వాకిటి మల్లారెడ్డి ఇంటికి వెళ్లి 'మీ ఇంటికి దోషం, కీడు ఉన్నాయి. శాంతి పూజ చేస్తే అంతా మంచి జరుగుతుంది' అని నమ్మించాడు. పూజ అనంతరం పది వేలు డిమాండ్ చేశాడు. అప్పటికే పత్తి అమ్మిన డబ్బులు పది వేలు ఒక కవర్‌తో, రూ.38,500 మరొక కవర్‌లో ఇంట్లో ఉండగా.. మల్లారెడ్డి పొరపాటున రూ.38,500 కవర్‌ను అతడికి ఇచ్చాడు. దాంతో అదే చాన్స్‌గా దొంగ బాబా ఉడాయించాడు. అనంతరం మల్లారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు 3 బృందాలుగా విడిపోయి నిందితుడిని పట్టుకున్నారు. ఈ క్రమంలో ఫోన్ పే వారికి ఉపయోగపడింది. అందుకు సంబంధించిన వివరాలను ఎస్‌హెచ్‌వో సోలోమాన్‌రాజ్ శనివారం వెల్లడించారు. నల్లగొండ జిల్లా మాడుగులపల్లి మండలంలోని తోపుచర్ల గ్రామానికి చెందిన షేక్ సత్తార్‌మియా బాబా వేషం కట్టి బైక్‌పై రెండు రోజుల క్రితం మోటకొండూర్ మండలం అమ్మనబోలు గ్రామంలోని ఒక వ్యక్తి ఇంటికి వెళ్లాడు. సేమ్ మల్లారెడ్డికి చెప్పినట్టే దోషం ఉందని చెప్పి ఏవో పూజలు చేశాడు. ఆ ఇంటి యజమాని రూ.7వేలు సత్తార్ మియాకు ఫోన్‌పే చేశాడు. మరుసటి రోజే మల్లారెడ్డిని బురిడీ కొట్టించాడు. ఫోన్ పే చేసిన నెంబర్ ఆధారంగా సిగ్నల్స్ ట్రేస్ చేసి శుక్రవారం రాత్రి నల్లగొండ పట్టణంలో సత్తార్‌మియాను అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో ఎస్ఐ కృష్ణయ్య, ఏఎస్ఐ సైదులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌హెచ్‌ఓ సోలామాన్‌రాజ్

# పోలీస్ కుటుంబాల పోరుబాట

## కూలీలుగా చూస్తున్నారని ఆవేదన

- మట్టి, గార్డెనింగ్ పనులు చేయిస్తున్నారని ఆగ్రహం
- సెలవు లేకుండా 10 రోజులపాటు విధులు
- సమస్యలు పరిష్కరించాలని బాధిత కుటుంబాల ఆందోళన
- బెటాలియన్ కానిస్టేబుళ్ల మెరుపు సమ్మె
- బందోబస్తుకు వెళ్లిన రూరల్ ఎస్ఐకి నిరసన
- పరామర్శకు వెళ్లిన మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అరెస్టు

నీలగిరి, అక్టోబర్ 25 : పేరుకు మాత్రం వాళ్లు పోలీస్ బెటాలియన్‌లోని కానిస్టేబుళ్లు.. చేయాల్సి వస్తున్నవి మాత్రం కూలీ పనులు. మట్టి మోయాలి. గడ్డి పీకాలి. లేదంటే, డ్యూటీ పేరుతో దూర ప్రాంతాలకు వేసి సెలవులు లేకుండా 10 రోజులుపాటు విధుల్లో ఉండాలి. ఆపై నాలుగు రోజులు సెలవులు ఇస్తే.. అందులో రెండ్రోజులు ఉన్నచోటుకు వచ్చిపోయేందుకే సరిపోతుంది. ఈ పరిస్థితులతో విసుగెత్తిన నల్లగొండ శివారులోని అన్నెపర్తిలో గల 12వ బెటాలియన్‌కు చెందిన పోలీస్ కుటుంబాలు ఆందోళన బాట పట్టాయి. ఇటీవల బెటాలియన్ కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యులు అద్దంకి–నార్కెట్‌పల్లి హైవేపై రాస్తారోకో చేయగా, తాజాగా శనివారం కానిస్టేబుళ్లు ఆందోళనకు దిగారు. రాష్ట్రంలో ఒకే పోలీస్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మెరుపు సమ్మె చేశారు. కానిస్టేబుళ్లు అందరూ సాముహికంగా సెలవులు పెట్టి నిరసన తెలిపారు. తమ కుటుంబ సభ్యులు ఆందోళన చేస్తే ఉన్నతాధికారులు అనుచితంగా మాట్లాడడంపై మండిపడ్డారు. నల్లగొండ రూరల్ ఎస్ఐ సైదాబాబు బందోబస్తు కోసం అక్కడికి వెళ్లగా.. ఎస్ఐ గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు. తమ కుటుంబ సభ్యులను దూషించిన ఎస్ఐని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కానిస్టేబుళ్లు అంతా ఆయన కారువైపు దూసుకురాగా, ఉద్రిక్తతకు దారి తీయకుండా సైదాబాబు అక్కడి నుంచి వెనుదిరిగారు. ఆందోళన విరమించాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ బెటాలియన్ కమాండెంట్‌కు నచ్చజెప్పే ప్రయత్నించినా కానిస్టేబుళ్లు వినలేదు కాగా, ఐదు రోజుల క్రితం ఆరుగురి కానిస్టేబుళ్లపై వేసిన సెస్పెన్షన్‌ను ఉన్నతాధికారులు ఎత్తేశారు.



అన్నెపర్తి 12వ బెటాలియన్‌లో ఆందోళన చేస్తున్న కానిస్టేబుళ్లతో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

## మాజీ ఎమ్మెల్యే కంచర్ల అరెస్ట్

### బెటాలియన్‌లోకి వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు

బెటాలియన్ ఉద్యోగుల కుటుంబ సభ్యులకు సంఘీభావం తెలిపేందుకు వెళ్లిన మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేసి మునుగోడు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బెటాలియన్ మెయిన్ గేట్ వద్ద కంచర్లను, కార్యకర్తలను అడ్డుకుని లోపలికి అనుమతి లేదంటూ గేట్లు మూసేశారు. బెటాలియన్ ఉన్నతాధికారులతో మాట్లాడేందుకు భూపాల్‌రెడ్డి ప్రయత్నించినా వారు అందుబాటులోకి రాలేదు. ఎస్పీ శరత్‌చంద్రపవార్ కమాండెంట్‌తో సమీక్ష జరుపుతున్నట్లు చెప్పడంతో కారులోనే కూర్చున్నారు. అరగంట తర్వాత డీఎస్పీ, సీఐలు అక్కడికి చేరుకుని అనుమతి లేనిది లోపలికి వెళ్లొద్దని, వెళ్లిపోవాలని చెప్పారు. హక్కుల సాధన కోసం రోడ్డెక్కిన బెటాయిలిన్ కానిస్టేబుల్ కుటుంబాలకు మద్దతు తెలిసి చెప్పినా వినకుండా కారు నుంచి దింపే ప్రయత్నం చేయగా.. మాజీ ఎమ్మెల్యేకు, పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది. కార్యకర్తలు అడ్డుకునే ప్రయత్నం చేయగా తోపులాట చోటుచేసుకుంది. పోలీసులు వారిని చెదరగొట్టి మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డిని ఎత్తుకెళ్లి పోలీస్ వాహనంలో కూర్చోబెట్టారు. దాంతో బీఆర్ఎస్ కార్యకర్తలు పోలీస్ వాహనానికి అడ్డుగా బైఠాయించారు. పోలీసులు వారిని నార్కట్‌పల్లి స్టేషన్‌కు తరలించారు. భూపాల్‌రెడ్డిని మునుగోడు పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లారు. ఆందోళనలో మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, మాజీ జడ్పీటీసీ నారబోయిన భిక్షం, నాయకులు రావుల శ్రీనివాస్‌రెడ్డి, జమాల్‌ఖాద్రీ, మెరుగు గోపి, దేప వెంకట్‌రెడ్డి, తవిటి కృష్ణ, మేకల అరవింద్‌రెడ్డి, గట్టయ్య, శంకర్, వెంకన్న, యుగేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బెటాలియన్‌లో కానిస్టేబుళ్లు, వారి కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు వెళ్లిన మాజీ ఎమ్మెల్యే కంచర్ల, భూపాల్‌రెడ్డిని అరెస్ట్ చేస్తున్న పోలీసులు

### పనులన్నీ సిబ్బందితోనే..

12వ బెటాలియన్‌లో సిబ్బందితోనే అన్ని రకాల పనులు చేయిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫైరింగ్ స్థలం నుంచి ట్రాక్టర్ ద్వారా మట్టి తెప్పించి రోడ్డుకు ఇరువైపులా పోయడం, గోడల నిర్మాణం, భవనాలకు రంగులు వేయడం వంటి పనులన్నీ కానిస్టేబుళ్లతోనే చేయిస్తున్నట్లు సమాచారం. మొక్కలు నాటడం, వాటిని సంరక్షణ చేసి పెంచడం, పెరిగిన కొమ్మలు నరకడం, గార్డెనింగ్, ఉన్నతాధికారుల ఇంటి పరిసరాలు, ఆఫీసుల వద్ద పిచ్చి మొక్కలు, గడ్డి తొలగించడం, వాటర్ ట్యాంకులు కడిగించడం, చెత్తాచెదారం ఏరడం వంటి పనులన్నీ చేయిస్తున్నారని కానిస్టేబుళ్లు వాపోతున్నారు. శాంతి భద్రతలు పరిరక్షించాలని, దేశ సేవ చేయాలని పోలీస్ ఉద్యోగంలో చేరితే కూలీల్లా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పనులు సిబ్బందితో చేయించి బిల్లులు మాత్రం పెట్టుకుని నిధుల దుర్వినియోగానికి పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.